# "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ"

**సాధుజనులను చూచి చౌక చేతురు**
**వారికేమి కొరత వసుధయందు?!**
**కుంజరమునుజూచి కుక్కలెన్నో మొరుగు**
**దాని ఘనతకేమి తక్కువగును?**

దివ్యాత్మ స్వరూపులారా!

సహజంగా గోచరమయ్యే ప్రతి పదార్థమునకు కొన్ని రంగులుంటుంటాయి. కానీ ఆ రంగులు ఆ పదార్థమునకు సహజమని భావిస్తున్నాము. కాదు కాదు. మన భావముల మార్పులే ఈ రంగుల మార్పుకు మూలకారణము. ఆకాశము చూస్తే నీలిరంగు, సముద్రము చూస్తే నీలిరంగుగా ఉంటున్నాది. ఆకాశము, సముద్రము నీలముగా ఉన్నవని అంటాము. ఇది చాలా తప్పు. సముద్రము నీలి రంగుతో లేదు. ఆకాశము నీలి వర్ణము కాదు. అత్యంత దూరంగా ఉండటంచేత ఆ విధమైన రంగు మన కంటికి కనిపిస్తున్నది. సముద్రముకూడా అగాధమైన లోతుగా ఉండటంచే నీలిరంగుగా కనిపిస్తుంది. దగ్గరకు వెళ్లి దానిని చేతితో తీసుకున్నప్పుడు ఏ రంగులేదు. అది తెల్లని రంగుగానే ఉంటుంది. కల్పితమైన వర్ణములు ఏమాత్రము కనిపించవు. అదే విధముగా మంచి చెడ్డలన్నీ మన విశ్వాసములపైన, మన భావములపైన ఆధారపడి ఉంటున్నాయి.

## సమస్త జీవులు దివ్యమైన ఆత్మతత్త్వమునుండియే ఆవిర్భవిస్తున్నాయి

నిజమైన రంగు మనకు గోచరమయ్యేదికాదు. నిజమైన రూపము కనిపించేదికాదు. నీటినుండి కరెంటు పుడుతున్నాది. విద్యుత్‌శక్తిద్వారా అనేక రకములైన ఉపయోగములు మనం అనుభవిస్తున్నాము. కానీ కరెంటు మనకు కనిపించటంలేదు. నీటినుండి ఆవిర్భవించిన కరెంటుద్వారా అనేక ఉపయోగములు జరుగుతున్నాయి గానీ కరెంటు

sri sathyasai vachanamrutam

మాత్రము కనిపించదు. అదే విధముగా సమస్త జీవులు, సమస్త ప్రాణులు దివ్యత్వమైన ఆత్మతత్త్వమునుండియే ఆవిర్భవిస్తున్నాయి. కానీ ఆత్మతత్త్వము కనిపించదు. దానినుండి ఆవిర్భవించిన జీవులయొక్క మంచిచెడ్డలు జీవులయొక్క ప్రవర్తనలు మనకు కనిపించుచున్నవి. శంకరులవారి అద్వైతము కాశీనగరములో నలుదిశలు ప్రాకిన తరువాత వేలాదిమంది పండితులంతా గుమిగూడారు. చిత్తశుద్ధి కలిగిన మానవుని మనస్సు పరిశుద్ధమైన అద్దమువలె ఉంటుంది. ఒక్కతూరి కన్నులు మూసుకున్నారు శంకరులు. ఆపత్తులోనున్న తల్లియొక్క దృశ్యము కనిపించింది. అప్పటికప్పుడు తాను సభను నిలిపి కాలడి వచ్చాడు. తల్లి కన్నులు మూసే పూర్వమే శంకరులవారు అక్కడ ప్రత్యక్షమై ఆమెకిచ్చిన వాగ్దానము పూర్తిగా నెరవేర్చి ఆమెకు అంత్యములో నోటిలో తులసి నీరు పోసారు. అప్పటి పరిస్థితియందు కేరళ ప్రజలు, దానికి విరుద్ధముగా ఉండేవారు.

### సర్వవిధములైన ఆశలు విడిచిపెట్టటమే సన్యాసము

సన్యాసి కర్మకాండలో ప్రవేశించకూడదు. సర్వ కర్మలు త్యాగముచేసి సన్యాసము స్వీకరించాడు. సన్యాసి అనగా అర్థము ఏమిటి? సర్వ ఆశలు వదలటమే సన్యాసము. ప్రాకృతమైన, నిత్యజీవిత కర్మలలో ప్రవేశించాడు, సన్యాసము తీసుకున్న శంకరులు. తల్లి అయినా సరే, తండ్రి అయినా సరే కర్మకాండలో ప్రవేశించకూడదు. విద్యార్థులకు అర్థమయ్యే నిమిత్తమై నేను కొంచెం లోతుగా పోవలసి వస్తుంది. మొట్టమొదట సన్యాసము తీసుకోక పూర్వము విరజాహోమము అని చేస్తారు. విరజాహోమము అనగా ఏమిటి? తాను మరణించినట్లు తన కర్మలు తానే చేసుకొని నూతనమైన వేషము, నూతనమైన నామము ధరిస్తాడు. రూపము మార్చుకుంటాడు, పూర్వరూపము పోయింది. పూర్వము ఈ దేహమునకు పెట్టిన పేరుకూడా పోయింది. నూతనమైన పేరు వస్తుంది. లోకానందము, నాగానందము, ఆనందము అంతా ఆనందములే! కానీ, వారిలో కించిత్తైనా ఆనందముండదు. అదియే విరజాహోమము. తన తద్దినము తానే చేసుకున్నాడు. అలాంటి సమయములో తల్లి ఎక్కడ, తండ్రి ఎక్కడ, కర్మకాండ ఎక్కడ? కనుక, కర్మకాండలో



sri sathyasai vahini

ప్రవేశించకూడదు. ఎట్టి సంబంధములేదు సన్యాసికి.

**భౌతికమైనదానికి మూలాధారమును ఎవరూ గుర్తించటంలేదు**

ఒక చిన్న ఉదాహరణ మీకు చెబుతున్నాను. బూర్గుల రామకృష్ణారావు ఉత్తరప్రదేశ్ గవర్నరుగా ఉంటున్నప్పుడు స్వామితో పవిత్రయాత్ర చేయాలనే ఉద్దేశ్యముతో ఒక 200 మంది భక్తులు బయలుదేరారు. రామకృష్ణారావు గొప్ప భక్తుడు, 12 భాషలు తెలిసిన వ్యక్తి. అతని మేధాశక్తి చాలా గొప్పది. సాక్షాత్ భగవంతునితోనే బదరీనాథ్, కేదార్‌నాథ్ వెళ్లాలి అని తాను నిర్ణయించుకున్నాడు. స్వామి వెడుతున్నాడని తెలిసి చాలా మంది అనేక ప్రాంతములనుంచి వచ్చారు. పవిత్ర హృదయులు, పవిత్ర దంపతులు వారిద్దరు యీ రెండు వందలమందికి మొదట భోజనము పెట్టి తదుపరి వారు భుజించేవారు. అందరు భోజనానికి కూర్చుంటే జగ్గుతో నీరు పోసేవారు. వాలంటీర్లు వచ్చి 'సార్ మేము చేస్తాం, మీరు కూర్చోండి' అంటే 'నేను స్వామిదాసుడను, గవర్నరును కాను' అని ఒకమాట చెప్పేవాడు. హైదరాబాద్‌లో ఉన్నప్పుడు ఆయన రాష్ట్రానికి ముఖ్యమంత్రి. స్వామి అప్పుడు మండపేట వెళ్లినప్పుడు వేలాదిమంది క్యూలో నుంచున్నారు. ఒకరి తరువాత ఒకరు దర్శనం చేసుకోవాలి. క్షణంకూడను ఆలస్యం చేయకూడదు. తిరుపతి మాదిరి తరుముతుంటారు వాలంటీర్లు 'వెళ్లండి', 'వెళ్లండి' అని. అతని హృదయము ఎలాంటిదో పిల్లలకు అర్థంకావాలి అని చెపుతున్నాను. ఆయన క్యూలో పోయి నిల్చున్నాడు. డిజీపి వచ్చాడు. 'మీరు ముఖ్యమంత్రి. మీరు క్యూలో వద్దు. ముందు రండి' అని చెప్పాడు. అప్పుడు రామకృష్ణారావు 'రాజకీయముగా నేను ముఖ్యమంత్రి కావచ్చు. కాని, ఆధ్యాత్మికంగా నేను ఇంకా భక్తుడనే! నాకు అంత భక్తిరాలేదు' అని చెప్పాడు. అంతటి గొప్ప హృదయము, బూర్గుల రామకృష్ణారావుది. నేను వెళ్లి ఋషికేశ్‌లో దిగాను. పెద్ద గెస్ట్‌హౌస్ మరియు కొన్ని యిళ్ళు అన్ని చేర్చి యీ రెండువందలమందికి వసతి ఏర్పాట్లు చేశారు. ఆనాడు శివానందస్వామి వారి శిష్యులు గెస్ట్‌హౌస్‌కి వచ్చి 'రేపటిదినము శివానందులవారి 70 వ జన్మదిన వేడుకకు స్వామి వచ్చి ఉద్ఘాటన చేయాల'న్నారు. నేను 'శివానంద పుట్టినరోజుకాదు, కుప్పుస్వామి పుట్టినరోజు' అన్నాను. శివానందమనే పేరుతో సన్యాసము

sri sathyasai vachanamrutam

తీసుకోక పూర్వము అతని పేరు కుప్పుస్వామి. ఆ కుప్పుస్వామి చనిపోయాడు. ఆ వేషమే మారిపోయింది. అప్పుడే శివానందమని పేరు పెట్టుకున్నాడు. 'శివానందము' అని పేరు పెట్టుకొన్నది 26వ సం॥లో. అందువలన అతనికి 70 సం॥లు కాదు' అన్నాను. కుప్పుస్వామికి 70 సం॥లు. శివానందకు 26 సం॥లు. అప్పుడు శివానంద చెప్పాడు. '70 సం॥లు అయింది యీ దేహమునకు. యింతవరకు ఎవరు నన్ను సుత్తితో కొట్టలేదు' అన్నాడు. భౌతికమైన దానినే ఆధారము చేసుకుంటున్నారు కానీ భౌతికమునకు మూలాధారమును ఎవరూ గుర్తించటంలేదు.

## యవ్వనము మధ్యలో వచ్చి మధ్యలో పోయేదే!

ఇది కేవలము దైవమునకు, దివ్యమైన అవతారములకు తప్ప అన్యులకు సాధ్యముకాదు. పుట్టినదిమొదలుకొని దేహము గిట్టునంతవరకు ఒకే రూపము, ఒకే నామము. ఈ విధంగా అద్వైతములోపల అనేకమంది పొరపాటు పడుతూ తన పూర్వ ఆశ్రమము ఆధారము చేసుకొని పూర్వ ఆశ్రమాన్ని అనుభవిస్తూ ఉంటారు. శంకరులవారికి ఆ గ్రామములో సహాయము చేసేవారు ఎవరూ లేకపోయారు. ఆ దేహము తీసుకొనిపోయి దహన సంస్కారము చేయాలి. ఎవరూ రాలేదు. నంబూద్రి బ్రాహ్మణులు ముట్టటానికి వీలుకాదన్నారు. ఎందుకంటే ధర్మవిరుద్ధమైన దానిలో ప్రవేశిస్తున్నాడు శంకరాచార్యులు. విధిలేక ఆ దేహమును తానే భుజముపై వేసుకొని తన పెరటిలోపలనే గుంత తవ్వి అక్కడే పూడ్చివేశాడు. స్మశానమునకు తీసుకొని పోయే సహాయములేదు. ఆనాడు శంకరులు ప్రారంభించిన యీ సంస్కారము ఈనాటికి ఎవరింటిలో పెద్దలుపోయినా యింటిపెరటిలోపలనే పూడ్చటము. స్మశానంలేదు. కేరళలో మీరు పోయి చూచినారంటే రోడ్డు పొడవున యిండ్లు ఉంటుంటాయి. వెనుక ఏమి ఉండదు. వెనక ఖాళీగా ఉంటుంది. ఆ యింటి వారుపోతే ఖాళీ కావాలి అక్కడ. శంకరులవారు తల్లికి యిచ్చిన వాగ్దానము నెరవేర్చుకొని తిరిగి కాశీ వెళ్లాడు. దారిని నడచుకుంటూ పోతున్నాడు. ఆ రోజుల్లో ఎక్కడకైనా నడచుకొనిపోవాలి. ఆనాడు టార్చిలైటు లేదు. ఒక కట్టకు నిప్పు అంటించుకొని నూనె పోసుకొని ప్రయాణము చేసేవారు. శంకరులు తన శిష్యులను చూచి 'ఈనాటి

sri sathyasai vachanamrutam

యువతీయువకులు మలమూత్రదుర్గంధమాంసరక్తములతోకూడిన శరీరమునకు ఆకర్షింపబడుతున్నారేగానీ దివ్యమైన ఆత్మతత్త్వమును ఎవరూ విచారించటంలేదు. దేహాన్ని వరిస్తున్నారు. దేహముయొక్క సౌందర్యము చూస్తున్నారు. ఆ సౌందర్యము చూచి ఆశిస్తున్నారు. ఛీ! యిది సరైనది కాదు. మానవునిగా పుట్టి క్షణములో మారిపోయే యీ దేహముపై యింత భ్రాంతియా? ఇవన్నీ క్షణక్షణమునకు మారిపోయే శరీరములే! అన్నీ రాలిపోయే శరీరములే! కట్టపడపటికి కాలిపోయే శరీరములే! యవ్వనము ఎట్లా ఉంటుంది? మధ్యలో వచ్చి మధ్యలో పోయే మేఘములే యీ యవ్వనము!' అని ఈ విధముగా ఒక శ్లోకము చెప్పి భౌతికశరీరతత్త్వము బోధిస్తూ వచ్చాడు. యువకులైనవారు అతి జాగ్రత్తగా మెలగాలి. శరీరదృష్టిని విస్మరించాలి. అంతా కేవలము దుర్గంధముతోకూడిన శరీరము. అందచందములంతా ఎక్కడ ఉంటున్నవి? యివి కేవలము భ్రమింపజేసేవే!

**'నీ కర్తవ్యాన్ని నీవు నిర్వర్తించు; కాయాన్ని దైవచింతనలో ఉపయోగించు!'**

ఒక కథ ఉంటున్నాది. ఒక రాజుకు ఏకైక కుమారుడున్నాడు. అతనికి 22 సం॥లు వచ్చింది. తండ్రి పిలచి 'నాయనా! నీవు యువరాజు కావాలి. నీకు 22 సం॥లు. ఇది సరైన వయస్సు. నీకు వివాహము చేయాలని సంకల్పించుకున్నాను' అన్నాడు. ఆ కుమారుడు తండ్రి యిచ్చిన స్వేచ్ఛచేత జవాబు చెప్పుకుంటూ వచ్చాడు. 'నాన్నా! నేను వివాహమాడదలచిన కన్యను నేనే ఎంచుకుంటాను' అన్నాడు. రాజుకు చాలా బాధ కలిగింది. కానీ కుమారుని బాధపెట్టటం తనకిష్టం లేకపోయింది. సరే ఏమీ మాట్లాడక లోపలకు వెళ్లాడు. రాజకుమారునికి తండ్రితో యీ విధంగా మాట్లాడానని మనస్సులో కొంత బాధ కల్గింది. నోటితో అన్నాడు మాత్రమేగాని conscience తృప్తికాలేదు. ఆ అబ్బాయి గుఱ్ఱాన్ని ఎక్కాడు. మార్పుకోసమని అడవికి పోవాలనుకున్నాడు. అరణ్యములో కొంతసేపు విహరించితే మనస్సు మార్పు రావచ్చును అనుకున్నాడు. నది ఒడ్డున గుఱ్ఱముపై పోతున్నాడు. ఒక కన్య ఐదారుమంది చెలికత్తెలతో చేరి గంగాస్నానము గావించాలని పవిత్రమైన హృదయముతో గంగానదికి పోతున్నది. ఆ అమ్మాయి తాను 'పుట్టినప్పటినుండి మగవారి ముఖము

చూడకూడదు. జీవితమంతా కన్యగానే జీవించాలి. జీవితమంతా భగవదర్పితము గావించుకోవాలి', అని సంకల్పించుకుంది. ఆమె చుట్టూ ఒక పరదా కట్టుకొని దానిని నలుగురు చెలికత్తెలు పట్టుకుంటే మధ్యలో ఈమె నదిలోకి వెడుతున్నాది. గుఱ్ఱముపైన పోయే రాజకుమారుడు ఆ అమ్మాయిముఖము చూచాడు. ప్రారంభమైంది వ్యాధి. గుఱ్ఱమును వెనుకకు తిప్పాడు. వెంటవచ్చిన దాసీలను ఈ కన్య ఎవరని ఎంక్వైరీ ప్రారంభించాడు. ఆ కన్యను గురించి తానే స్వయంగా తండ్రికి చెప్పటానికి భయపడి మంత్రితో చెప్పించాడు. 'అందమైన ఒక అమ్మాయిని ఈనాడు నేను చూచాను. ఆ అమ్మాయిని నేను వివాహమాడాలి' అని చెప్పాడు. ఆమె అదే గ్రామములో ఒక వణిక్ పుత్రి అనగా ఒక వ్యాపారి కుమార్తె. ఆ వ్యాపారికి ఆమె ఏకైక పుత్రిక. వెళ్లి ఆ తండ్రిని అడిగారు. ఆ తండ్రి చాలా సంతోషించాడు, 'రాజకుమారుడు తన అల్లుడుగా వస్తున్నాడుకదా యింతకంటె అదృష్టము ఏమిట'ని లోలోపల చాలా ఆనందించాడు. కానీ బిడ్డకు చెప్పలేదు. ఆమె ఈ విషయము తెలుసుకొని 'నేను వివాహము చేసుకోన'ని ఒక నిర్ణయమునకు వచ్చింది. కానీ తండ్రికి చెప్పుటకు యిష్టము లేదు. చెబుతే బాధ పడతాడో ఏమోనని, చెప్పకపోతే రాజు ఏమంటాడోనని లోలోపల బాధ పడుతూ వచ్చింది. ఒక దినము గంగనుండి స్నానము చేసి యింటికి వచ్చింది. తండ్రి అరుగుపై కూర్చున్నాడు. 'నాన్నా! మీరు ఒక వారంనుంచి విచారంగా ఉంటున్నారు కారణం ఏమిటి?' అని అడిగింది. ఈ లోపుగా ప్రతిదినము రాజుగారు వార్తను పంపుతున్నాడు 'ఎప్పుడు ఎప్పుడు' అని. రాజకుమారునికికూడా ఎప్పుడెప్పుడు ఆ కన్యతో తనకు వివాహము జరుగుతుందా అని టైఫాయిడ్ ఫీవరు మాదిరి పెరిగిపోతున్నాది టెంపరేచరు. ఆమె చెప్పింది. 'నేను వివాహమాడను' అని. అప్పుడు తండ్రి 'రాజుకు ఏవిధంగా చెప్పాలి', అని అడిగాడు. 'వివాహము చేసుకోటానికి యిష్టము లేదు మా బిడ్డకు', అని చెప్పండి అంది. ఈ వార్త చెప్పేటప్పటికి రాజు 'నేను రాజును, నేను బలవంతంగానైనా నా కుమారునికి మీ కుమార్తెతో వివాహము చేస్తాను', అని బెదిరించాడు. ఈ వార్త తండ్రికి తెలిసి చాలా బాధపడుతున్నాడు. ఏ నిమిషంలో ఏ సిపాయిని పంపించి నా బిడ్డను ఎత్తుకు పోతారా ఏమోనని బాధపడుతున్నాడు. కానీ. ఆ బిడ్డ సాయంకాలము గంగకు పోయి స్నానంచేసి వచ్చి ధ్యానంలో కూర్చుంది. 'ఓ భగవంతుడా! నా ప్రతిజ్ఞకు ఎట్టి భంగముకలుగకుండా, రాజుకు అసంతృప్తి కలుగకుండా, నా

తండ్రికి ఏ విధమైన చింతలేక ఉండేటట్లు ఏదైనా ఉపాయము ఇయ్యి', అని ప్రార్థించింది. ఆమె హృదయపూర్వకంగా ప్రార్థన చేసింది కనుక భగవంతుడు తక్షణమే అంగీకరించాడు. ఉపాయం తనకే పుట్టింది. తక్షణమే 'నాన్నా! నేను రాజకుమారుని వివాహమాడతానని వార్త పంపించు' అన్నది. 'అయితే ఎనిమిది దినములు టైము యివ్వాలి' అని ఒక షరతు పెట్టింది. యింకా ఎనిమిది రోజులా అని ఆ రాజకుమారుడు నిరుత్సాహములోనున్నాడు. ఈ వార్త రాజుకు పంపించాడు. రాజు చాలా సంతోషించాడు. ఆనాటినుండి ఒక వైద్యుని దగ్గరకు వెళ్లి ప్రతిదినము భేదులయ్యేటట్టు మందులు తీసుకుంది. ఒక్కొక్క దినము పోయిన భేదులంతా ఒక్కొక్క పాత్రలో ఎత్తుకుంది. ఎనిమిది దినములకు ఎనిమిది పాత్రలంతా నిండినాయి. ఎనిమిది దినముల తరువాత ఒక యింటిలో వీరు యిద్దరు కలుసుకోవాలి. ఈమె కొన్ని ప్రశ్నలు అడుగుతుంది. దానికి రాజకుమారుడు జవాబులు చెప్పాలి. ఎనిమిది దినములు జరిగిపోయింది. అందమైన ఈమె శరీరము అస్థిపంజరముగా తయారైంది. కన్నులు లోపలకు పోయినాయి. చాలా వికారంగా మారిపోయింది. చాలా బలహీనురాలైపోయింది. ఆనాడు పల్లకిపై తాము యిరువురు చేరవలసిన చోటకు పోయి చేరాలి. రాజకుమారుడు చాతకపక్షివలే ఆమె ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నాడు. ఈ అమ్మాయి పల్లకి దిగింది. చెలికత్తెలు ఆమెను పట్టుకున్నారు. నడవటానికి శక్తిలేదు. చూచాడు రాజకుమారుడు. ఎనిమిదిమంది చెలికత్తెలు ఎనిమిది పాత్రలు తీసుకువస్తున్నారు. రాజకుమారుడు చూచాడు. 'నేను చూచిన అమ్మాయి చాలా అందమైనది. ఈ అమ్మాయి రోగి-వ్యాధిగ్రస్తురాలుగా ఉంటున్నాది. ఈమెను నేను కోరలేదు' అన్నాడు. ఆమె చేతులు జోడించి 'రాజకుమారా! మీరు నా అందము చూచి భ్రమించారు. నా అందమంతా ఆ ఎనిమిది పాత్రలలో ఉంటున్నాది. ఆ అందమును మొట్టమొదట తీసుకోండి! తరువాత నన్ను వివాహమాడండి' అనింది. 'ఆ పాడు పదార్థము ఈ దేహములో నున్నంతవరకు అందచందములతో కనిపించాను. మలమూత్రదుర్గంధమాంసరక్తములతో నున్నది ఈ దేహము. నా అందమంతా ఈ రూపాన్ని ధరించింది. ఈ మలమూత్రములే నా అందము. దీన్ని చూచి నా అందమని భావించారు మీరు', అని ఈమె చాలా గట్టిగా వాదించింది. ఎందుకంటే భగవద్భావము ఆమెలో ఉంటున్నాది. ఆ మాదిరి చేసేటప్పటికి రాజకుమారుని మనస్సు తిరిగింది. తానుకూడా అనుకున్నాడు. నిజమే!

sri sathyasai vahini

దేహము ఏమిటి?

**పాంచభౌతికము దుర్బలమైన కాయంబు**
**ఎప్పుడో విడిచేది ఎరుకలేదు**
**శత వర్షములదాక మితము చెప్పిరిగాని**
**నమ్మరాదామాట నెమ్మనమున**
**బాల్యమందో మంచి ప్రాయమందో లేక**
**ముదిమియందో లేక ముసలియందో**
**ఊరనో అడవినో ఉదక మధ్యంబునో**
**ఎక్కడో విడిచేది ఎఱుక లేదు**
**మరణమే నిశ్చయమ్మది మానవునకు**
**బుద్ధిమంతుడై తన దేహమున్నయపుడె**
**తన్ను తా తెలియుట ధర్మతత్వ మరయ**
**సత్యమైనట్టి బాట శ్రీసాయి మాట!**

ఏమిటి? Body is like a water bubble, mind is like a mad monkey. ఈ విధంగా అమ్మాయి దేహతత్త్వమును గురించి వివరంగా చెప్పింది. చాలా గొప్ప వేదాంతమన్నాడు. ఆ వేదాంతమును తాను అనుసరించి వివాహము లేకుండా నిల్చిపోయాడు. దీనినే శంకరులవారు యువకులందరికి బోధిస్తూ వచ్చాడు. అంటే అందరిని సన్యాసము తీసుకోమని చెప్పలేదు. నిజానికి ఆయన ఎవరికీ సన్యాసము తీసుకోమని బోధించలేదు. 'నీ కర్తవ్యము నీవు నిర్వర్తించు. కాయాన్ని దైవచింతనలో ఉపయోగించు' అని బోధ చేశాడు.

**మూలాధారతత్త్వమును ఆధారము చేసుకుని ప్రాకృతమైన, మిథ్యయైన జగత్తును అనుభవించాలి**

యీనాటి యువకులు, యువతులు కేవలం కదలిపోయే మేఘములవంటి యీయొక్క దేహసౌందర్యమునకే లోనైపోయి కుక్కలవలె, నక్కలవలె జీవించటానికి ప్రయత్నిస్తున్నారు. అటువంటివారికి శంకరులు చక్కని అద్వైతము బోధిస్తూ వచ్చాడు. ఏమిటి? మీరు తరుచు

సినిమాలకు పోతున్నారు. సినిమాలు చూస్తున్నారు. ముందర తెల్లని తెరమాత్రమే కనిపిస్తుంది. ఆ తెరను చూస్తూ కూర్చోలేరు కదా! అందువలన దేనికొరకో ఎదురుచూస్తారు. దేనికి? బొమ్మలకోసం. బొమ్మలొస్తే ఆనందముగా చూస్తారు. అవి ఏమైనా నిలకడగా ఉంటున్నాయా? లేదు. తిరిగిపోతున్నాయి. తిరిగి బొమ్మలు వస్తున్నాయి. ఈ విధంగా బొమ్మలు రావటం, పోవటం జరుగుతున్నాది. కానీ, తెరమాత్రం రావటంలేదు, పోవటంలేదు. స్థిరంగా ఉంటున్నాది. అదే 'బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య'. మిథ్య అనగా జగత్తు జ-రావటం, గత్-పోవటం. రావటం, పోవటం, యిదే జగత్తు. బొమ్మలు వస్తున్నాయి, పోతున్నాయి. అది జగత్తు. బ్రహ్మ సత్యం; తెర ఎప్పుడూ ఉంటున్నాది. అట్టి సత్యమును ఎవరూ చూట్టానికి యిష్టపడరు. బొమ్మలొస్తే మాత్రం ఆ తెర చూస్తారు. మరునిమిషంలో మరొక వేదాంత సత్యాన్ని చెప్పాడు. 'సర్వం విష్ణుమయం జగత్' అన్నాడు. 'అంతా విష్ణుమయమే! అంతా దైవమయమే!' అన్నాడు. పండితులు ఆశ్చర్యపడ్డారు. కొన్ని నిముషముల క్రిందట 'జగత్తు మిథ్య', 'బ్రహ్మ సత్యమ'న్నాడు. యిప్పుడు 'సర్వము విష్ణుమయం జగత్తు' అంటున్నాడు. అది నిజమా, ఇది నిజమా? 'అదీ నిజము, యిదీ నిజము' అన్నాడు, శంకరులవారు. బొమ్మలు వస్తున్నాయి, పోతున్నాయి.

**పునరపి జననం పునరపి మరణం పునరపి జననీ జఠరే శయనం**
**ఇహసంసారే బహుదుస్తారే కృపయా పారే పాహి మురారే**

అంతా మిథ్యయే. పుట్టటం, చావటం, యిది నిత్యము. కానీ జగత్ పుట్టటం లేదు, చావటంలేదు. 'సర్వం విష్ణుమయం జగత్' దీనికి యింకొక ఉదాహరణ. తెర ఉంటున్నాది. తెరపై బొమ్మలు పడుతున్నాయి. ఈ బొమ్మలు మాత్రమే చూస్తున్నారు. ఈ బొమ్మలు వచ్చినప్పుడు ఆ శాశ్వతంగా ఉన్న తెర ఎక్కడుంది? తెర ఆ బొమ్మలతోనే కలసి ఉంది. తెరలేక బొమ్మలే కనిపించవు. కాబట్టి వెనుక ఉంటున్నది తెర. వెనుకగా తెర ఉండటంచేత బొమ్మలు మనకు కనిపిస్తున్నాయి. కాబట్టి బొమ్మలలోకూడా యీ తెర ఉంటున్నాది. శాశ్వతమైన ఈశ్వరత్వము అనిత్యమైన బొమ్మలతో ఏకమై ఉంటున్నాది. అదియే 'సర్వమ్ విష్ణుమయం జగత్' తెరలేక బొమ్మలు లేవు. తెర బొమ్మలలో ఉంటున్నాది. అదియే

srisathyasaivachanamrutam

ఆత్మతత్త్వము. 'ఈశావాస్య మిదం జగత్'. అన్ని బొమ్మలందు ఉండినది ఆత్మ ఒక్కటే. అదే తెర. ఆ తెరవల్లనే అన్ని వస్తున్నాయి, పోతున్నాయి. ఆ తెరలేక బొమ్మలే కనిపించవు. అదంతా సత్యమైనది. ఈ విధమైన అద్వైతమును శంకరులు జగత్తుకు చాటుతూ వచ్చాడు. ఈ జగత్తంతా ఒక తెర. ఇందులో పుట్టే చచ్చే జీవులంతా తెరపైనే కనిపిస్తున్నాయి. కానీ ప్రతి బొమ్మయందు ఈ తెర లీనమై ఉంటున్నాది. తెరలేక బొమ్మలే లేవు. అద్వైతమనగా మూలాధారతత్త్వమును ఆధారం చేసుకొని ప్రాకృతమైన, మిథ్యయైన జగత్తును అనుభవించాలి. జగత్తంతా వచ్చిపోయే మిథ్య. ఈ మిథ్యయైన జగత్తంతా సత్యమైన తెరపై ఆధారపడి ఉంటున్నాది. ఆ తెరలేక జగత్తులో ఏదీలేదు. సృష్టి దానిపై ఆధారపడి ఉంటున్నాది.

**ఆత్మ సర్వులయందు చైతన్యరూపములో ఉంటున్నది**

మూలాధారమైన వస్తువును మనం గుర్తించుటకు ప్రయత్నించాలి. అప్పుడే ఏకత్వము మనకు చక్కగా అర్థమవుతూవస్తుంది. ఆ ఏకత్వమే ఆత్మ. ఆ ఆత్మ సర్వులయందు చైతన్యరూపములో ఉంటున్నాది. దానినే 'బ్రహ్మ', 'రామ' 'కృష్ణ' అన్నారు. దానినే 'విష్ణువు' అన్నారు. దానినే 'శివుడు' అన్నారు. దానినే 'అల్లా' అన్నారు. అనేక పేర్లు పెడుతూ వచ్చారు. ఇవన్నీ పెట్టిన పేర్లే! దైవత్వము సర్వత్ర ఉంటున్నాది. ఇట్టి అద్వైతమును గొప్ప గొప్ప పండితులకు విపులంగా బోధిస్తూ వచ్చాడు. ఈ అద్వైతము అందరికి సరిగా అర్థముకాదు. అందరు ఉంటున్నారు. అందరు విడివిడిగా కనిపిస్తున్నారు. అయితే అందరియందున్న మూలాధారశక్తి ఒక్కటే! అదే ప్రాణశక్తి. ఆ ప్రాణశక్తికే 'అహం' అని పేరు పెట్టారు. ఏమిటి అ ప్రాణశక్తి? గాలి తీసుకుంటాము. 'సో...హం'; విడిచి పెడుతున్నాము. ఇదే ప్రాణశక్తి. యిది ఉన్నది కనుకనే దేహము నిలుస్తున్నాది. సో-అది, హం-నేను. 'అదే నేను'. 'అదే ఆత్మ', 'అదే హంసగాయత్రి' అన్నారు. హంస గాయత్రి అనగా అదే నేను అని చెప్పేదే! ఆత్మస్వరూపము. దీనినే యింకొక మార్గములో యోగులు ఇడ, పింగళ అని చెబుతూ వచ్చారు. కుడివైపున గాలి పీల్చుకోటం. ఎడమవైపున వదులుతున్నాడు. పీల్చివదలే సమయంలో కొంతకాలము స్థంభించి ఉంటుంది. పూరకము, రేచకము. మధ్యలో నిలిపేదే

srisathyasaivachanamrutam

కుంభకము. ఇదే ప్రాణాయామములో చెబుతున్నారు. ఈ ప్రాణాయామ సంబంధమైన సాధనలే ఆత్మ సంబంధమైన సాధనలు. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి. ఈ అష్టాంగయోగములందు కుంభకము, పూరకము, రేచకము చెబుతూ వచ్చారు. పూరకమనగా నింపుకోటం..సో, రేచకము.. వదలటం. ఈ రెండింటికి మధ్యలో కొంతకాలము నిలపటము. కుంభకమే భ్రూమధ్యస్థానమన్నారు. దృష్టిని అక్కడ నిల్పి ధ్యానము చేయమని యోగులు చెబుతూ వచ్చారు. అనగా ఆత్మస్థానము.

### భక్తి, కర్మలకు మధ్య జ్ఞానము అంతర్వాహినిగా పోతుంది

అన్నింటికి మూలాధారమైన ఆత్మ ఏదియో దానిపైన దృష్టి నిలుపుకోమని చెప్పారు. దీనినే ప్రాకృతమైన, లౌకికమైన, భౌతిక జగత్తునందు 'ప్రయాగ' అని పేరు పెట్టారు. ప్రయాగ అనగా గంగ, యమున, సరస్వతి మూడుచేరిన స్థానము అని. ఈ మూడు ఎక్కడ చేరుతున్నాయి? ఆత్మదగ్గర చేరుతున్నాయి. గంగ-పవిత్రమైన, స్వార్థరహితమైన కర్మకే 'గంగ' అని పేరు పెట్టారు, శంకరులవారు. యమున, ఒక ఉపాసన కింద పెట్టాడు. యమున భక్తిమార్గము, జ్ఞానము-సరస్వతి కనుపించేదికాదు. అంతర్వాహిని. భక్తి, కర్మలకు మధ్యలో జ్ఞానము అంతర్వాహినిగా పోతుంది. మనం ప్రయాగకు పోవాలంటే టిక్కట్టు తీసుకొని ట్రైనులో, కారులో, ప్రయాణమవుతాము. ఆ విధంగా పోవటానికి వీలుకాదు. సుమారు 200 సం॥ల క్రితమే మీరాను భర్త యింటినుండి వెళ్లిపొమ్మని చెప్పి తోసివేసినప్పుడు ఆమె తన మనసుకు చెప్పింది:

**చలోరేమన్, చలోరేమన్ గంగాయమునా తీర్**
**గంగాయమున నిర్మల పానీ శీతలహోవె శరీర్ ।చలోరే।**

అక్కడ ఆత్మ అనే కృష్ణుడు ఉంటున్నాడు. ఎట్లా ఉన్నాడు?

**మోరమకుట పీతాంబరశోభే కుండల రజిత శరీర్ ।చలోరే।**

రాణా 'వెళ్లిపో!' అనగానే టిక్కట్టుకోసం ప్రయత్నం చేయలేదు. పవిత్ర హృదయులయొక్క భావాలు అలా పవిత్రంగా ఉంటాయి.

srisathyasaivachanamrutam

## దేహాభిమానంతో కాక ఆత్మాభిమానంతో ప్రేమించడమే నిజమైన ప్రేమ

శంకరులు ఇలాంటి అద్వైతసిద్ధాంతమును, బాల్యమునుండి యౌవనమువరకు, యౌవనమునుండి వృద్ధులకు ఒకే ఏకాత్మభావమును బోధించాడు. ఈవిధంగా దినదినమునకు అద్వైతసిద్ధాంతము పెరిగిపోతూ వచ్చింది. అందరూ దానిని అంగీకరిస్తూ వచ్చారు. ఆ సమయంలో ఆయన గురువు కాశీకి వచ్చాడు. పూర్వము ఆయన 'శంకరా' అని పిలిచేవాడు. అంతకుముందు శంకరులకు కొంత అపవిత్రము జరిగింది. ప్రతి పండితునితో వాదించి వారిని అద్వైత సిద్ధాంతములో ప్రవేశింపచేసుకుంటూ వచ్చాడు. ఆ మార్గములో మండనమిశ్రుడనే ఒక పండితునితో వాదించుటకు పోయినాడు. ఆ పండితుని భార్య, ఉభయభారతి. ఆమె గొప్ప వేదాంతి. తన భర్త ఓడిపోయాడు. ఆయన ఒప్పందము ప్రకారము తాను సన్యాసము తీసుకోవాలని పట్టు పట్టాడు. అప్పుడు ఉభయభారతి 'శంకరా! మీకు సర్వధర్మములు తెలుసును. నేను ఆయన అర్ధాంగిని. ఆ శరీరములో సగభాగము నేను. మీరు నన్నుకూడా ఓడించినప్పుడే ఆయన సన్యాసము తీసుకొనుటకు వీలవుతుంది. లేకపోతే ఆయన సన్యాసము స్వీకరించడానికి అర్హుడు కాదంది. సరే వాదోపవాదములు మొదలుపెట్టమన్నాడు శంకరుడు. ఆమె గృహస్థ ధర్మమైన కామశాస్త్రమునందు ఒక ప్రశ్నవేసింది. శంకరులవారు చిన్నప్పుడే సన్యాసము స్వీకరించినందున ఆ ప్రశ్నకు సమాధానము ఆయనకు తెలియదు. అప్పుడు ఉభయభారతి దగ్గర ఒక నెల టైము తీసుకున్నాడు. నీ ప్రశ్నకు జవాబు చెప్పటానికి ఒక నెల కావాలన్నాడు. ప్రయాణమై పోతున్నాడు. ఆ సమయములో కాశీరాజు మరణించాడు. కాశీరాజు శవమును ఒక దగ్గర పెట్టారు. ఇదే సమయమని శంకరులవారు పరకాయ ప్రవేశము చేసి ఆ దేహములో ప్రవేశించాడు. శంకరుల దేహము మరణించింది. రాజుగారి దేహములో ప్రవేశించాడు. రాజు బ్రతికాడని ప్రజలు ఆనందించి రాజ భవనములోకి తీసుకుపోయారు. అక్కడ ఆ దేహములో సంచరించేది శంకరులే! రాజు ఉండిన గృహస్థాశ్రమములో తాను ప్రవేశించాడు. అయితే తన conscience గృహస్థునిగా సంసారము చేయడానికి అంగీకరించలేదు. తక్షణమే రాజు దేహము వదలి తన దేహములో వచ్చి చేరిపోయి ఉభయభారతికి సమాధానము చెప్పాడు. ఈ విధంగా ఈమెకు సమాధానము చెప్పి కాశ్మీరు

srisathyasaivahini/vacharamrutam

ప్రయాణమయ్యాడు. అక్కడ గొప్ప గొప్ప పండితులు, దిగ్గజాలు ఉన్నారు. ఎప్పుడైతే శంకరులు కాశ్మీరులో ప్రవేశించాడో తక్షణమే అక్కడ కొండపైనున్న కనకదుర్గ ఆలయము తలుపులు వాటంతట అవే మూసుకున్నాయి. ఎంత ప్రయత్నము చేసినా తలుపులు తెరువబడలేదు. పండితులు అందరూపోయి అనేక విధములుగా ప్రయత్నము చేస్తున్నారు. ప్రార్థనలు సల్పుతున్నారు. ఇతిహాస, పురాణ, ప్రమాణములు పఠిస్తున్నారు. కానీ తెరుచుకోలేదు. అప్పుడు శక్తి స్వరూపిణి అయిన కనకదుర్గ అశరీరవాణిగా ఒక వాక్కు చెప్పింది: 'శంకరులవారు చాలా గొప్పవారు. ఆచార్యుడు. ప్రతి ఒక్కటి తాను ఆచరించి చూపిస్తూవచ్చాడు. కానీ, అతనిలో ఒక మాలిన్యము చేరిపోయింది. ఆ మాలిన్యము తరుమగొట్టటానికి తగిన ప్రయత్నము చేసినప్పుడే ఆ తలుపులు తెరుచుకుంటాయి'. అప్పుడు శంకరాచార్యులవారు గురుదేవతాస్తోత్రం చెబుతూ వచ్చారు:

**ఈశ గిరీశ నరేశ పరేశ సురేశ విభో**
**సాంబ సదా శివ శంభో శంకర**
**శరణం మే తవ చరణయుగం**

అనేక రకములుగా ప్రార్థిస్తూవచ్చాడు. నేను పరకాయ ప్రవేశములో పోయి రాజ భవనములో అనుభవించిన దోషమే ఈ దేవాలయ ద్వారములు మూసుకుపోవడానికి కారణము. ఈ దోషపరిహార నిమిత్తమై 11 దినములు నిద్రాహారములు లేకుండా పానీయములు తీసుకోకుండా ప్రాయశ్చిత్తము చేసుకుంటానని చెప్పి అక్కడ తపస్సు చేస్తూ కూర్చున్నాడు. 12వ దినము తలుపులు తెరుచుకున్నాయి. చూశారా! శంకరులవారు అంత గొప్ప దీక్ష పూనాడు. ఈనాడు కృష్ణమూర్తి, ఛటర్జీ ప్రేమను గురించి చెబుతూ వచ్చారు. ఏ ప్రేమ? అక్కడ ప్రశ్న వేయాలి. 'అందరూ స్వామిని ప్రేమించండి. ఈ ప్రేమచేత సర్వము సార్థకమవుతుంది' అన్నారు. ఎట్టి ప్రేమ? లౌకికప్రేమ కాదు. లౌకికప్రేమలో పోవటంచేత శంకరులవారికికూడా యీ విధముగా దోషం సంక్రమించింది. అదికూడా తన యిష్టముతోకాదు; కేవలం ఉభయభారతికి జవాబు చెప్పాలి అని. ఆత్మభావముతో ప్రేమిస్తే ఏ దోషమూ ఉండదు. దేహాభిమానంతోకాక ఆత్మాభిమానంతో ప్రేమించటమే నిజమైన



srisathyasaivachanamrutam

ప్రేమ. ఆత్మాభిమానమే నిజమైన ప్రేమ. అట్టి ప్రేమయే దైవము. Love is GOD, Live in LOVE. అట్టి ప్రేమతో ఉన్నప్పుడు చిత్తశుద్ధి అవుతుంది. ప్రేమతత్త్వము శుద్ధిగా మారిపోతుంది.

**చిత్తశుద్ధితో ఏ కార్యము చేసినా అది పవిత్రముగా రూపొందుతుంది**

**వేదవేదాంగములు వల్లెవేసియున్న**
**గద్యపద్యంబులను కూర్పగల్గియున్న**
**చిత్తశుద్ధియె లేకున్న చెడును వాడు**
**సత్యమును తెల్పు బాట శ్రీ సాయిమాట.**

ఈ వేదములు, వేదాంగములు, శాస్త్రములు, పురాణములు యివికాదు ప్రధానములు. చిత్తశుద్ధితో ఏమిచేసినా అది మంచిదే! అదియే పవిత్రము. అదియే దివ్యత్వము. అదియే ఆత్మతత్త్వము. ఏదో ఒక ఫలాపేక్షతో చేయటం కాదు. అది ఆత్మయే, ఇది ఆత్మయే అని ఆత్మభావముతో ప్రేమించాలి. ఇదే నిజమైన ప్రేమతత్త్వము. ఇట్టి ప్రేమతత్త్వాన్ని మదిలో నింపుకొనే శంకరులవారు యావత్ప్రపంచమునకు యీ అద్వైతసిద్ధాంతము ప్రబోధిస్తూ వచ్చాడు. యువకులకు యింకా కఠినముగా చెబుతూ వచ్చాడు. కేవలము విషయము చెప్పినంతమాత్రమున, వినినంతమాత్రమున విరక్తిరాదు. నాకు తెలుసు. ఒక పెద్ద వ్యాపారస్తుడు ప్రతిదినము భగవత్సమావేశముకోసం పోతూ ఉండేవాడు. అక్కడ ఒక గొప్ప పండితుడు శ్రవణానందముగా బోధిస్తూ వచ్చాడు. ఈ సప్తాహము పూర్తి అయ్యేవరకు వినాలి, పూర్తిగా విన్న తరువాత అప్పుడు పూర్ణమవుతుంది అన్నాడు. ఐదు దినములు జరిగింది. ఆరవదినము ఈ వ్యాపారి అర్జంటుగా ఎక్కడికో వెళ్ళవలసిన పని ఏర్పడింది. తక్షణమే కుమారుని పిలిచి 'బాబూ! ఆ పండితుడు ఏడుదినములు సత్సంగమునకు హాజరవాలని చెప్పాడు. అప్పుడే దీని ఫలితము మనకు చిక్కుతుందని చెప్పాడు. కాబట్టి నేడు నీవు వెళ్ళు పారాయణకు. రేపటిదినము నేను వస్తాను' అని చెప్పి తిరిగి రూములోకి పోయాడు. కాని ఇంతలో మళ్ళీ 'ఆ పండితుడు వేదాంతము చెబుతున్నాడు, వైరాగ్యం బోధిస్తున్నాడు. దేహాన్ని చులకన చేసి చెబుతున్నాడు. సంసారములో మునగకూడదు,

sri sathyasai vachanamrutam

యిట్లాంటివి బోధిస్తున్నాడు. నా కుమారుడు వింటే వాడు విరాగి అవుతాడో ఏమిటో!' అనుకున్నాడు. తక్షణమే పండితుని దగ్గరకు వెళ్లాడు. 'పండితుడా! రేపటిదినము నా కుమారుని సత్సంగమునకు పంపిస్తున్నాను. మీరు వాడికి తీవ్రమైన వైరాగ్యమును బోధించకండి. ప్రపంచముపై రాగమునభివృద్ధి పరచే బోధలుకూడా చేయండి' అని విన్నవించుకున్నాడు. అప్పుడు పండితుడు చెప్పాడు: 'నీ ఒక్క కుమారునికోసమై నేను వేదంతము మానివేసుకోటమా! శెట్టిగారూ! ఆరుదినములు మీరు నా ఉపన్యాసము విన్నారు. మీకు ఎంత వేదాంతము వచ్చింది? ఎంత త్యాగము వచ్చింది? ఒక్క దినము మీ కుమారుడు విన్నంత మాత్రమున అతనికి త్యాగము వస్తుందా జన్మాంతరముల వికారమనే పర్వతములవంటి పాపములు ఎట్లా తొలగిపోతాయి? ఇది అంత సులభంగా తెగిపోయేదికాదు'. అదే విధంగా తోమి తోమి పిల్లలలో వైరాగ్యము తెప్పించాలని దీక్ష పట్టాడు, శంకరులవారు. అప్పుడే నిత్యము దానిని ఉపయోగించుకోటానికి వీలవుతుంది. నిత్యము ఉపయోగించుకొనే పాత్ర నిత్యము తోమవలసిందే! పెద్ద పెద్ద పాత్రలంతా పెండ్లికి ఉపయోగిస్తారు అవి మాత్రము సంవత్సరమునకు ఒకతూరి తోముతే చాలు. నిత్యము ఉపయోగించుకునే టంబ్లరు ఎప్పటికప్పుడు కడుగుతూనే ఉండాలి. అదే రీతిగా యవ్వనములోనున్న దేహమును నిత్యము తోమి పరిశుద్ధము చేస్తూ ఉండాలి. ఆ విధమైన బోధలు చేస్తూ శంకరులవారు యువకులకు వైరాగ్యమును ప్రబోధిస్తూ వచ్చారు.

### అనిత్యమైన జగత్తునందు పొందే సుఖము ఏమీ లేదు

వైరాగ్యమంటే ఏమనుకుంటున్నారు? పూర్వము చెప్పాను. అన్నము కక్కిన తరువాత తిరిగి దానిని ఎవరైనా తినటానికి ప్రయత్నిస్తారా? కక్కిన అన్నముపై ఎంత తీవ్రమైన విరక్తి వస్తుందో ఆ విధంగా రావాలి, విరక్తి. ఏదో I shall try అనుకుంటే అది dry అయిపోతుంది. Must do, must do. మీ కోసమే చెబుతున్నాను. ఈ జగత్తునందు వచ్చే సుఖమేమీ లేదు. ఈ జగత్తునందు కలిగే ఆనందమేమీలేదు. ఎంత ఆదాయము, ఆనందము కలిగినా, ఒక్కనాటికి ఇవన్నీ త్యజించి పోవలసిందే! దైవమును మాత్రమే గట్టిగా పట్టుకోవలసింది. అతనే నిత్యసత్యమైన ఆరాధ్య దైవము. అట్టి దైవత్వమును నీవు పట్టాలి. ఆ strong determi-

sri sathyasai vahini amrutam

nation పట్టుదల ఉండాలి. అప్పుడే తగిన ఫలితము మనకు లభ్యమవుతుంది. తీవ్రమైన వైరాగ్య భావాన్ని పెట్టుకున్నప్పుడే దైవత్వము మనలో ఆవిర్భవిస్తాడు. ఇది సత్యం, సత్యం, సత్యం! శంకరుల వైరాగ్యము జగత్తునకు ఎంతయో ఉపకారము చేస్తూ వచ్చింది. అద్వైత సిద్ధాంతమును పండితులు అందరు బోధిస్తున్నారే గాని వారిలో ఎవ్వరూకూడా ఆ రీతిగా నడచుకోటంలేదు. కేవలం వాక్కుతో బోధించినంతమాత్రమున చాలదు; శరీరముతో దానిని ఆచరించాలి. మనస్సులో త్యాగభావము రావాలి. అదియే నిజమైన వైరాగ్యము. అది కేవలము సత్యజ్ఞానమనంతముతో వస్తుంది. దైవం సత్యం, జ్ఞానం సత్యం; అంతా అనిత్యము. కనుక సత్యజ్ఞానమనంతం బ్రహ్మతత్త్వం.

**(తేదీ 09-09-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam